RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్
సంపుటి : 4, సంచిక : 19

ఆదివారం
డిసెంబర్ 21, 2025

పేజీలు : 6
వెల : రూ.3-00

దినపత్రిక



## యూరియాకు 'యాప్' ఇక్కట్లు

4లో..

- రోజువారీ జీవితంలో భాగమైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్
- సౌకర్యాల వెనుక దాగిన ఎన్నో ప్రమాదాలు
- అవకాశాల మధ్య పెరుగుతున్న అనర్థాలు
- వాయిస్ క్లోనింగ్, ఫిషింగ్ మెయిల్స్‌తో పెరుగుతున్న సైబర్ నేరాలు
- సాంకేతికత తప్పు కాదు.. దుర్వినియోగమే అసలు సమస్య



# ఎంత పనిచేస్తున్నవ్.. ఏఐ!

వేద న్యూస్ SUNDAY SPECIAL!

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

ఏఐ.. ఈ పదం ఇప్పుడు కేవలం టెక్నాలజీ నిపుణుల మాటల్లో మాత్రమే కాదు.. సామాన్యుల రోజువారీ జీవితం లోనూ వినిపిస్తోంది. మొబైల్ ఫోన్లలో వాయిస్ అసిస్టెంట్లు, సోషల్ మీడియాలో ఆటోమేటెడ్ కంటెంట్, ఆస్పత్రుల్లో రోగ నిర్ధారణ, బ్యాంకుల్లో భద్రతా వ్యవస్థలు.. ఇలా ఏఐ మన జీవితాన్ని తెలియకుండానే నడిపిస్తోంది. అయితే, ఈ సాంకేతిక విప్లవం సమాజానికి ఉపయోగపడుతూనే, మరో వైపు ప్రమాదకరమైన అనర్థాలకు కూడా దారి తీస్తుం డటం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీని కొంతమంది మేధావులు ఎన్నో రంగాల్లో ఉపయు క్తంగా ఉపయోగించుంటూ ముందుకు సాగుతుంటే.. కొంతమంది మాత్రం దానిని అనర్థాలకు వాడుతున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ అనేది మంచిదే అయినా.. దాని ప్రభావం అనేది ఉపయోగించే తీరుపై ఆధారపడి ఉంటుంది అనేది జగమెరిగిన సత్యం. ఏదిఏమైనా ఏఐ.. అనేది రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. సులభతరం అవుతున్న జీవితం..ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ వల్ల పనులు వేగంగా పూర్తవుతున్నాయి. ఒకప్పుడు గంటల తరబడి చేయాల్సిన పని నిమిషాల్లో అయిపోతోంది. సమాచారం వెతకడం, భాషలు అనువదించడం, డాక్యుమెంట్లు తయారు చేయడం వంటి పనుల్లో ఏఐ మనిషికి సహాయకుడిగా మారింది. కానీ ఈ సౌలభ్యం మనిషిని మెల్లగా అలసత్వానికి, ఆలోచనా శక్తి తగ్గిపోవడానికి దారి తీస్తోందనే ఆందోళన కూడా వ్యక్తమ వుతోంది. ఉద్యోగ రంగంలో మొదలైన ఆందోళనఏఐ విస్తృత వినియోగంతో అనేక వృత్తులు ప్రమాదంలో పడుతున్నాయి. డేటా ఎంట్రీ, కస్టమర్ సపోర్ట్, అకౌంటింగ్ వంటి రంగాల్లో మానవ శ్రమకు బదులుగా యంత్రాలు రంగప్రవేశం చేస్తున్నాయి. ఒకప్పుడు పదిమందికి ఉపాధినిచ్చే సంస్థలు, ఇప్పుడు కొద్ది మంది సిబ్బందితోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీనివల్ల రాబోయే కాలంలో నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. డీప్ ఫేక్‌తో మసకబారుతున్న నిజంఏఐ

మిగతా 3వ పేజీలో..

# హైదరాబాద్‌లో రాష్ట్రపతి పర్యటన

- జాతీయ స్థాయి సదస్సుకు హాజరు
- పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఉప రాష్ట్రపతి
- నగరంలో భద్రత కట్టుదిట్టం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారమే నగరానికి చేరుకోగా, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ శనివారం హైదరాబాద్‌కు వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నేడు నిర్వహించనున్న పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల జాతీయ స్థాయి సమావేశ ముగింపు సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన నున్నారు. ఈ కార్యక్రమం కోసం

మిగతా 3వ పేజీలో..

# 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'లో చంద్రబాబు

- చెత్త నుంచి సంపద సృష్టింపుపై ప్రత్యక్ష పరిశీలన
- కశింకోటలో పారిశుధ్య కార్మికులతో కలిసి పర్యటన
- చెత్త సేకరణపై ప్రజల అభిప్రాయాల సేకరణ
- రైతులకు ఎరువులు అందిస్తున్న కంపోస్ట్ యూనిట్ సందర్శన



**వేద న్యూస్, అనకాపల్లి:**

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శనివారం అనకాపల్లి నియోజకవర్గంలోని కశింకోటలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను పరిశీలించారు. చెత్త సేకరణ, వేరు చేయడం, నిర్వహణ వంటి అంశాలపై పారిశుధ్య కార్మికుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ పనిలో ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన సదుపాయాలపై కార్మికులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఆయన శ్రద్ధగా విన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలను ప్రభుత్వం గౌరవిస్తుందని, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే చెత్త సేకరణ వ్యవస్థపై స్థానిక ప్రజల అభిప్రాయాలను కూడా ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. ఇంటింటి చెత్త వేరు చేయడం, పరిశుభ్రత పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. పరిశుభ్రత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించినప్పుడే లక్ష్యం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. తదుపరి ముఖ్యమంత్రి కంపోస్ట్ తయారీ యార్డును సందర్శించారు. చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చే విధానాన్ని పరిశీలించి, అక్కడ జరుగుతున్న ప్రక్రియలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసి రైతులకు ఎరువుల రూపంలో అందించడం వల్ల వ్యవసాయానికి మేలు జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ విధానం పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల ఖర్చులు తగ్గించడంలో కూడా సహకరిస్తుందని అభిప్రాయపడ్డారు. కంపోస్ట్ యూనిట్ నిర్వాహకుడితో మాట్లాడిన ముఖ్యమంత్రి, ఇటువంటి కేంద్రాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. చెత్త నిర్వహణను ఆదాయ వనరుగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన మార్గంలో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# నిజాం నాటి చెరువుకు కొత్త ఊపిరి!

- పూర్వ వైభవం తీసుకొచ్చిన హైడ్రా
- బమ్ - రుక్న్ - ఉద్ - దౌలా చెరువు ప్రారంభానికి సన్నాహాలు
- అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్
- ఆహ్లాదంగా బండ్ ఏర్పాటు



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

పాతబస్తీలో నిజాం కాలానికి చెందిన చారిత్రక బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువుకు హైడ్రా కొత్త ప్రాణం పోసింది. దశాబ్దాలుగా ఆక్రమణలతో ఆనవాళ్లు కోల్పోయిన ఈ చెరువును తిరిగి గుర్తింపునిచ్చి, చరిత్రను తవ్వితీసినట్టుగా సర్వాంగసుందరంగా అభివృద్ధి చేస్తోంది. జనవరిలో చెరువును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆక్రమణలతో పూర్తిగా మాయమైపోయిందనుకున్న చెరువుకు హైడ్రా తిరిగి జీవం పోసిందని స్థానికులు పేర్కొంటున్నారు. చెరువు చుట్టూ రహదారులు, ప్రవేశ ద్వారాలు సౌకర్యవంతంగాఉండేలా చర్యలు

మిగతా 3వ పేజీలో..

# గ్రామీణులు బీజేపీ వైపు చూస్తున్నారు

- రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి
- గ్రామీణాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వ దృష్టి
- ప్రతిపక్షాలు ప్రజల ఆశలు నెరవేర్చడంలో విఫలమయ్యాయి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులకు సన్మానం

3లో..

# గాంధీ పేరు వింటేనే మోదీకి వణుకు

- ఉపాధి హామీలో పేరు తొలగింపు అప్రజాస్వామికం
- వచ్చే ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం ఖాయం
- పంచాయతీ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల గుణపాఠం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- ఏఐసీసీ పిలుపుతో ఎంజీ రోడ్డులో కాంగ్రెస్ ధర్నా

3లో..

వేద న్యూస్

ఆదివారం డిసెంబర్ 21, 2025

# గోల్కొండ కోటలో సీఈసీ గ్యానేశ కుమార్



- హైదరాబాద్ పర్యటనలో భాగంగా రాక
- వారసత్వ విశేషాల పరిశీలన
- శ్రీశైలం మల్లికార్జున దర్శనం పూర్తి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్ అధికారిక కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చి గోల్కొండ కోటను సందర్శించారు. నగరంలోని ఐకానిక్ హెరిటేజ్ కాంప్లెక్స్‌గా గుర్తింపు పొందిన గోల్కొండ కోటలో ఆయన పర్యటించి, అక్కడి నిర్మాణ శైలి, శిల్పకళా ప్రత్యేకతలు, చారిత్రక ప్రాధాన్యతను సమగ్రంగా పరిశీలించారు. దేశ వారసత్వ సంపదల సంరక్షణపై అధికారులు ఇచ్చిన వివరాలను ఆయన ఆసక్తిగా విన్నారు. గోల్కొండ కోట పరిధిలోని ప్రధాన ఆకర్షణలు, రక్షణ వ్యవస్థల నిర్మాణ విధానం, అప్పటి పాలకుల కాలంలో రూపొందించిన వాస్తు లక్షణాలపై సీఈసీ దృష్టి సారించారు. శబ్ద ప్రతిధ్వని వ్యవస్థ, కోట గోడల బలమైన నిర్మాణం, నీటి నిర్వహణ పద్ధతులు వంటి అంశాలు ఆయనను విశేషంగా ఆకట్టుకున్నట్లు సమాచారం. వారసత్వ కట్టడాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌కు రాకముందు సీఈసీ గ్యానేశ్ కుమార్ నంద్యాల జిల్లాలోని శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి దేవస్థానాన్ని సందర్శించారు. శుక్రవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న ఆయన అభిషేకం సహా పలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి భ్రమరాంబ గెస్ట్‌హౌస్‌లో బస చేసి, తెల్లవారుజామున మరోసారి స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం 4.30 గంటలకు కుంకుమార్చన, వేదాశీర్వచనం, అభిషేకంలో పాల్గొన్న అనంతరం ఉదయం 11 గంటలకు శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వచ్చారు. సీఈసీ పర్యటన ప్రశాంతంగా సాగిందని, భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలి

- శ్రీరాముడి ఆశీస్సులతో..
- భద్రాచలంలో ప్రత్యేక పూజల్లో నరేష్ మైనాల



**వేద న్యూస్, వరంగల్:**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అద్భుతమైన ఫలితాలు సాధించిన బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా ముందుకు సాగాలని శ్రీరాముడిని ప్రార్థించామని కేటీ ఆర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరేష్ మైనాల తెలిపారు. భద్రాచలం శ్రీరామచంద్ర స్వామి ఆలయంలో శని వారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామ స్థాయిలో బీఆర్ఎస్‌పై ప్రజల విశ్వాసం మరోసారి స్పష్టమైంది. కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా నిలబెట్టిన కార్యకర్తల శ్రమకు ఇది ఫలితం. ప్రజల ఆశీర్వాదంతో, శ్రీరాముడి కృపతో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు కేసీఆర్ అని, యువతకు ఆశాకిరణంగా నిలిచిన కేటీఆర్ నాయకత్వం తెలంగాణ భవిష్యత్తుకు మార్గదర్శకమని అన్నారు. "ధర్మం, న్యాయం, ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ సిద్ధాంతం. అదే శ్రీరాముడి బోధన కూడా" అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల మధ్యకు మరింత దగ్గరగా వెళ్లి, సమస్యలపై పోరాటం చేస్తూ, బీఆర్ఎస్ జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్తామని నరేష్ మైనాల స్పష్టం చేశారు.

# జన హృదయ నేత కౌశిక్ కు జన్మదిన శుభాకాంక్షలు

- బీఆర్ఎస్ నేత వంగ రమేశ్




**వేద న్యూస్, హుజురాబాద్:**

హుజురాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ యువనేత పాడి కౌశిక్ రెడ్డి కి ఆ పార్టీ లీడర్, మ్రి పల్లిగూడెం గ్రామ గులాబీ శాఖ అధ్యక్షుడు వంగ రమేష్ శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకుడు కౌశిక్ రెడ్డి నాయకత్వంలో హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో పార్టీ మరింత బలోపేతం అవుతున్న దని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో ఇప్పటికే పలు స్థానాలను కై వసం చేసుకోగా, రాబోయే ఎంపీటీసీ జడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ బర్త్ డే వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. జనహృదయనేత కౌశిక్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఫేక్ న్యూస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఫార్వర్డ్ చేసే ముందు చెక్ చేయండి
- తెలంగాణ పోలీసుల హెచ్చరిక




**వేద న్యూస్, హైదరాబాద్:**

సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. చూసిన ప్రతి వార్తను నమ్మకుండా, ఫార్వర్డ్ చేసే ముందు తప్పనిసరిగా నిజానిజాలను పరిశీలించాలని సూచించారు. ఒకసారి తప్పుడు వార్త వైరల్ అయితే అది సామాజిక గందరగోళానికి, చట్టపరమైన సమస్యలకు దారితీస్తుందని పోలీసులు స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసుల సూచనల ప్రకారం, సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, వీడియోలు, ఫోటోలు నమ్మే ముందు వాటి మూలాలను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా అనుమానాస్పదమైన సమాచారం, భావోద్వేగాలను రెచ్చగొట్టే సందేశాలు, సంచలన శీర్షికలతో వచ్చే వార్తల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే అది నేరమని హెచ్చరించారు. ఫేక్ న్యూస్‌ను షేర్ చేయడం ద్వారా వ్యక్తిగతంగా కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల్లో వచ్చే సమాచారాన్ని క్రాస్ చెక్ చేయాలని సూచించారు. సమాజ శాంతి భద్రతలు కాపాడాలంటే ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలంగాణ పోలీసులు తెలిపారు. ఫేక్ న్యూస్‌కు దూరంగా ఉండటం, నిజమైన సమాచారాన్నే షేర్ చేయడం ద్వారా మాత్రమే సమాజంలో శాంతి, నమ్మకం నిలబడుతాయని పోలీసు శాఖ పిలుపునిచ్చింది.

# చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ



**వేద న్యూస్, రుద్రూర్:**

లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ మెంబర్ లయన్ పార్వతి ప్రశాంత్ కుమార్తె పార్వతి వేదశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకొని రుద్రూర్ మండల కేంద్రంలో గల ఎనిమిది అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా లయన్ మెంబర్ శామీర్ జన్మదినం సందర్భంగా రుద్రూర్ గ్రామంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కేవి. మోహన్, రీజియన్ చైర్మన్ లయన్ శ్యామ్ సుందర్ పహాడే, లయన్ క్లబ్ సభ్యులు గాండ్ల మధు, పార్వతి ప్రశాంత్, పుట్టి సాగర్, శ్రీకాంత్ గౌడ్, సాయి కుమార్, వినయ్, రాజు, అంగన్వాడీ టీచర్లు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి'పై రాజకీయం వద్దు




- కేంద్రం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఎంజీఎన్ఆర్ఈజీఏ నుంచి గాంధీ పేరు తొలగింపుపై నిరసన
- గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

అధికారంలో ఉన్నామనే అహంకారంతో కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన నిర్ణయం తీసుకుందని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని ఖండిస్తూ హైదరాబాద్ ఎంజీ రోడ్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కోట్లాది గ్రామీణ పేదల జీవనాధారమని, దానిపై రాజకీయ ప్రయోగాలు చేయడం అన్యాయమని అన్నారు. ప్రతి భారతీయుని గౌరవాన్ని దెబ్బతీసే ఈ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అట్టడుగు పేద ప్రజలు కరువు కాటకాల్లో ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన గొప్ప పథకాన్ని నిర్వీర్యం చేయాలన్న ఉద్దేశంతోనే ఈ మార్పు చేశారని జూపల్లి ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరు దేశ చరిత్ర, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలుస్తుందని, అలాంటి పేరును తొలగించడం దేశవ్యాప్తంగా ఆగ్రహానికి దారితీస్తుందని చెప్పారు. ఈ నిర్ణయం వెనుక రాజకీయ కక్ష ఉందని ఆయన పేర్కొన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఉన్న కోపంతో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని స్పష్టం చేశారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో పేదలపై భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ఈ చట్టం మార్పును పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు పల్లెలన్నీ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాసంఘాలు ఈ అంశంపై ఉద్యమం చేయాలని సూచించారు. మహాత్మా గాంధీ పేరుతో అనుసంధానమైన పథకాన్ని కాపాడుకోవడమే ప్రజాస్వామ్య బాధ్యత అని మంత్రి అన్నారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు సత్కారం

- టీపీసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం



**వేద న్యూస్, హైదరాబాద్:**

టీపీసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నవీన్ యాదవ్ ప్రజాప్రతినిధిగా నిర్వహిస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రజా సమస్యలపై చురుకైన స్పందన, నియోజకవర్గ అభివృద్ధిలో చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి న్యాయవాదుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, చిన్న శ్రీశైలం యాదవ్‌తో పాటు పలువురు న్యాయవాదులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. న్యాయవాదుల సమిష్టి కృషితో ప్రజాస్వామ్య విలువలు మరింత బలపడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

# వయోవృద్ధుల సంక్షేమం కోసం న్యాయ సేవలు




- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

**వేద న్యూస్,వరంగల్ ప్రతినిధి :**

వరంగల్ ఆర్డీఓ కార్యాలయంలో శనివారం వృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన న్యాయ సేవల శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ, వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారదతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ "తల్లిదండ్రులు మరియు వృద్ధుల సంరక్షణ – మన సామాజిక మరియు చట్టపరమైన బాధ్యత అని తెలిపారు. ఈ ఉచిత న్యాయ సేవా శిబిరం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, ఇది మన ఇంట్లో ఉన్న వృద్ధులకు మనం ఇచ్చే భరోసా. వృద్ధులలో ఆత్మగౌరవం తగ్గకూడదని, నేటి సమాజంలో మారుతున్న జీవనశైలి వల్ల చాలామంది వృద్ధులు ఒంటరితనాన్ని, నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం 2007లో "తల్లిదండ్రులు మరియు వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం" తీసుకువచ్చిందని తెలిపారు. వృద్ధులు పోషణ పొందే హక్కు, ఆస్తి రక్షణ, తక్షణ పరిష్కారం మొదలగు హక్కులు కలిగి ఉన్నారని వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా ఈ న్యాయ సేవా శిబిరమును సంప్రదించి, ఉచిత న్యాయ సలహాలు పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, వృదు ్ధలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, వారికి అవస రమైన న్యాయ సహాయం సకాలంలో అందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, ఆర్.డి.ఓ. టి.సుమ, డి.ఏ.ఓ.ఫణి కుమార్, న్యాయవాది యస్.కుమార్, పారా లీగల్ వాలంటీర్ ఆలేటి.డార్కస్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వరంగల్ అధ్యక్షులు మల్లారెడ్డి, వయోవృద్ధులు పాల్గొన్నారు.

# బుగ్గగూడ శివారులో పెద్దపులి సంచారం



**వేద న్యూస్, కాసిపేట:**

బుగ్గగూడ శివారులో పెద్దపులి సంచారం ఉన్నట్లు సమాచారం అందడంతో అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దపులికి సంబంధించిన పాదముద్రలను గుర్తించినట్లు తెలిపారు. పులి ఈ ప్రాంతంలో తరచుగా సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలకు అటవీ శాఖ అవగాహన కల్పించింది. పశువుల కాపరులు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, చేలల్లో పనిచేసే రైతులు గుంపులుగా, శబ్దం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. అటవీ శాఖ అధికారులను తప్ప మరెవరు చెప్పే పుకార్లను నమ్మవద్దని తెలిపారు. బుగ్గగూడ, లంబడి తండా (డి), కరిసెల ఘట్టం గ్రామాల్లో డప్పు చాటింపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సీహెచ్ పూర్ణచందర్ వెల్లడించారు. పాదముద్రల ఆనవాళ్లను డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్ (ముత్తంపల్లి), ఎఫ్ఎస్ఓ జె. సత్యనారాయణ (ధర్మారావుపేట), ఎఫ్బీఓ యుగంధర్ కుమార్ స్వామి, వాచర్ పోశం తదితరులు సేకరించారు.

# లంచం తీసుకుంటూ దొరికాడు

- యూరియా సరఫరా పేరుతో రూ.20వేలు డిమాండ్
- రూ.10వేలు తీసుకుంటూ పట్టుబడ్డ జిల్లా వ్యవసాయాధికారి



**వేద న్యూస్, వనపర్తి:**

వనపర్తి జిల్లా వ్యవసాయ అధికారి పుప్పాల ఆంజనేయులు గౌడ్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఫిర్యాదు దారునికి ఎటువంటి అంతరాయం లేకుండా క్రమం తప్పకుండా యూరియా ఎరువులు అందించేందుకు గాను ఇరవై వేల రూపాయల లంచం డిమాండ్ చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఈ మొత్తంలో ఇప్పటికే మూడు వేల రూపాయలు తీసుకున్న ఆయన, మిగిలిన మొత్తంలో నుంచి పది వేల రూపాయలు స్వీకరిస్తున్న సమయంలో పట్టుబడ్డారు. ఫిర్యాదు అందిన వెంటనే అవినీతి నిరోధక శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నినట్లు సమాచారం. జిల్లా వ్యవసాయ అధికారి లంచం తీసుకుంటున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. రైతులకు అవసరమైన ఎరువుల సరఫరాను అడ్డుపెట్టుకుని లంచాలు డిమాండ్ చేయడం తీవ్ర తప్పిదమని అధికారులు పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో లంచం డిమాండ్ చేసినట్టు, స్వీకరించినట్టు స్పష్టమైన ఆధారాలు లభించినట్లు అవినీతినిరోధక శాఖ వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవినీతినిరోధక శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే వెంటనే అవినీతినిరోధక శాఖను సంప్రదించాలని కోరింది.

# కుట్ర చేస్తున్న బీజేపీ ప్రభుత్వం..!

- ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని : సిపిఐ కార్యదర్శి ఉదయ్



**వేద న్యూస్, దామరచర్ల :**

పథకాలు పేర్లు మార్చి పేదలను మోసం చేయడంతో పాటు, నిధులు తగ్గించి దేశ ప్రజలకు ఉపాధి లేకుండా చేయాలనే బీజేపీ ప్రభుత్వ కుట్రపూరితమైనటువంటి కార్యచరణ ను తీవ్రంగా ఖండిస్తున్నామని దామరచర్ల సిపిఐ కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం గుజరాత్ బనియన్లకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ రంగాలను వారికి అప్పజెప్పుతున్నారని ఆరోపించారు. దేశంలోనే కోట్లాదిమంది గ్రామీణ పేద ప్రజలు ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని అన్నారు. ఇంత అద్భుతమైన పథకానికి 60 శాతం నిధులు కేటాయించి రాష్ట్రంపై 40 శాతం భారం వేస్తూ పథకానికి తూట్లు పొడవాలని చూడడం సరైన పద్ధతి కాదన్నారు. నల్లధనం వెనక్కి తెస్తామని దేశంలో ప్రజలకు హామీ ఇచ్చి గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం నేడు అది తేకపోగా ఉన్న స్కీములను నిర్వీర్యం చేయాలని కుట్ర చేస్తుందని చెప్పారు. ఎట్టి పరిస్థితిలో ఉపాధి హామీ పథకాన్ని మార్చాలని చూస్తే గ్రామీణ కార్మికులను కర్షకులను రైతులను సమీకరించి ఎంఎన్ఆర్ఇజిఎ చట్టాన్ని కాపాడుకునేంతవరకు పోరాడతామని ఆయన హెచ్చరించారు.

# ఉత్సాహంగా 'ఫుడ్ ఫెస్టివల్'

- కరీమాబాద్ కివి స్కూల్లో
- ఆహా ఏమి రుచి అని కితాబిచ్చిన ప్రిన్సిపాల్ సతీష్ మూర్తి



**వేద న్యూస్ , కరీమాబాద్ :**

వరంగల్ నగరం ఎస్ఆర్ఆర్ తోటలోని కివి పాఠశాలలో కివి కార్నివాల్ పేరిట ఫుడ్ ఫెస్టివల్ ని ఘనంగా నిర్వహించారు. సుమారు 250 మంది విద్యారి విద్యార్థినుల తో ఈ కార్యక్రమం శనివారం అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలు స్వయంగా తమ తల్లి తండ్రితో కలిసి రోజు వారిగా తినే ఆహారం, పలు రకాల వంటలతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోకుండా అని వైవిధ్యం అయినటువంటి వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ మూర్తి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు సామూహిక చైతన్య భావాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి, ఆనందాన్ని ఇచ్చే వేదికలని పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు అభినందనలు తెలిపారు. ప్రత్యేకించి విద్యార్థులు తెచ్చిన వంటను రుచి చూసిన ప్రిన్సిపాల్ సతీష్ మూర్తిఆహా ఏమి రుచి అని కితాబిచ్చారు.

# నిజాం నాటి చెరువుకు కొత్త ఊపిరి!





తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. బండ్‌పై ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్‌లు, లోపలివైపు ఫెన్సింగ్ పనులు, చిన్నారుల కోసం రెండు వైపులా ఏర్పాటు చేస్తున్న ప్లే ఏరియాలు, వృద్ధులు సేదతీరేందుకు నిర్మాణాలను ఆయన పరిశీలించారు. పార్కులు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాట్లు కూడా ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేలా చేయాలని సూచించారు.

నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న వేళ, నేషనల్ పోలీస్ అకాడమీకి సమీపంలో అభివృద్ధి చేస్తున్న ఈ చెరువును సంపూర్ణ విహార కేంద్రంగా తీర్చిదిద్దాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఔషధ గుణాలున్న వృక్షజాతులు, పచ్చిక బయళ్లు చెరువు చుట్టూ విస్తృతంగా నాటాలని, పరిసర ఉష్ణోగ్రతల్లో మార్పు కనిపించేలా పచ్చని వాతావరణం నెలకొల్పాలని ఆదేశించారు. నిజాంల కాలంలో వాడిన రాతిని వినియోగిస్తూ కట్టడాలు పటిష్టంగా ఉండేలా చూడాలని, ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్‌లు విశాలంగా ఉండేలా నిర్మాణాలు చేయాలని సూచించారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్ ప్రాంతాల నుంచి సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో వర్షపు నీరు చెరువుకు చేరేలా ఏర్పాట్లు చేస్తూ, వరద కష్టాలకు చెక్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భద్రత కోసం సీసీటీవీ కెమెరాలతో నిఘా పటిష్టం చేస్తున్నారు.

**చారిత్రక పూర్వ వైభవం ఎంతో..**

చరిత్రను తలచుకుంటే ఈ చెరువు వైభవం మరింత స్పష్టమవుతుందని స్థానిక వృద్ధులు చెబుతున్నారు. 1970లో మూడవ నిజాం సికందర్ జాహ్ పాలనలో అప్పటి ప్రధాని నవాబ్ రుక్న్ - ఉద్ -దౌలా ఈ చెరువును నిర్మించారని చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి. ఒకప్పుడు 104 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు తాగునీటి అవసరాలను తీర్చేదని చరిత్ర చెబుతోంది. కాలక్రమంలో విస్తీర్ణం తగ్గి హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం 17.05 ఎకరాలకు పరిమితమై, చివరికి 4.12 ఎకరాలకే చేరింది. గత ఏడాది ఆగస్టులో హైడ్రా ఆక్రమణలను తొలగించి పూర్తిస్థాయిలో భూమిని తిరిగి అందుబాటులోకి తెచ్చింది. రాజేంద్రనగర్, ఆరాంఘర్, కాటేదాన్ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఈ చెరువుకు చేరేదని, నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు, బమ్ - రుక్న్ - ఉద్ - దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని స్థానికులు వివరిస్తున్నారు. ఔషధ గుణాలున్న వనమూలికలు చెరువులో ఉండేవని, ఆ నీటిని తాగేందుకు, సువాసన ద్రవ్యాల తయారీకీ ఉపయోగించేవారని, అరబ్ దేశాలకు కూడా ఈ నీటిని తీసుకెళ్లేవారని చెబుతున్నారు. ఇంతటి చరిత్ర ఉన్న చెరువు తిరిగి పునరుద్ధరణకు నోచుకోవడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ, హైడ్రాకు అభినందనలు తెలుపుతున్నారు.

# ఎంత పనిచేస్తున్నవ్.. ఏఐ!

ఆధారంగా రూపొందుతున్న డీప్ ఫేక్ వీడియోలు, నకిలీ ఆడియోలు సమాజంలో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల మాటలను వక్రీకరించడం, ప్రముఖుల పేరుతో తప్పుడు వీడియోలు సృష్టించడం, సామాన్యుల ప్రతిష్ఠను దెబ్బతీయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. నిజం ఏది? అబద్ధం ఏది? అన్నది గుర్తించడం సామాన్యుడికి కష్టంగా మారుతోంది. ఇది ప్రజాస్వామ్య విలువలకే ముప్పుగా మారే పరిస్థితి ఏర్పడుతోంది.సైబర్ నేరాలకు కొత్త ఊపిరిఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో సైబర్ నేరాలు మరింత తెలివిగా మారాయి. వాయిస్ క్లోనింగ్ ద్వారా బ్యాంక్ కాల్స్‌లా మాట్లాడడం, అసలైన మెయిల్స్‌లా కనిపించే ఫిషింగ్ మెయిల్స్ పంపడం, నకిలీ లింక్స్ ద్వారా ఖాతాలు ఖాళీ చేయడం వంటి ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. టెక్నాలజీపై అవగాహన లేని సామాన్య ప్రజలు వీటి బారిన ఎక్కువగా పడుతున్నారు.గోప్యతపై పెరుగుతున్న భయంఏఐ సిస్టమ్స్ పనిచేయడానికి పెద్ద ఎత్తున వ్యక్తిగత డేటా అవసరం అవుతోంది. మన మాటలు, అలవాట్లు, ఫోటోలు, ముఖ గుర్తింపు వివరాలు… అన్నీ డేటాగా మారిపోతున్నాయి. ఈ సమాచారం ఎవరికి చేరుతోంది? ఎలా వాడబడుతోంది? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేవు. గోప్యత హక్కు క్రమంగా నశిస్తున్నదనే ఆందోళన ప్రజల్లో పెరుగుతోంది.అన్ని సమస్యల మధ్యనూ ఏఐ అందిస్తున్న లాభాలుఇంతటి ప్రమాదాలున్నప్పటికీ, ఏఐని పూర్తిగా తిరస్కరించడం సాధ్యం కాదు. వైద్య రంగంలో వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, విద్యలో వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా బోధన అందించడం, వ్యవసాయంలో పంట దిగుబడులు అంచనా వేయడం వంటి రంగాల్లో ఏఐ అద్భుత ఫలితాలు ఇస్తోంది. ప్రత్యేకించి గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలకు ఈ సాంకేతికత పెద్ద దిక్సూచి అవుతోంది.సమస్య సాంకేతికతలో కాదు.. దుర్వినియోగంలోనే..నిపుణుల అభిప్రాయం ప్రకారం ఏఐ అనేది మంచి, చెడుల మధ్య మధ్యస్థ సాధనం. దాన్ని ఎలా వాడుతున్నామన్నదే కీలకం. నియంత్రణ లేకుండా వదిలేస్తే ఇది సమాజానికి ముప్పుగా మారుతుంది. సరైన నియమాలతో వాడితే అభివృద్ధికి బలమైన ఆయుధంగా మారుతుంది. ఏఐ వినియోగంపై కఠిన చట్టాలు, నైతిక మార్గదర్శకాలు, డేటా రక్షణ విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే, మనిషి సృష్టించిన యంత్రాలే రేపు మనిషి జీవితాన్ని నియంత్రించే పరిస్థితి రావచ్చనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఏఐ ఒక ఆగలేని ప్రవాహం. దాన్ని ఆపడం అసాధ్యం. కానీ దానికి సరైన దిశ చూపించడమే ఈ తరానికి ఉన్న అతిపెద్ద బాధ్యత.

# గ్రామీణులు బీజేపీ వైపు చూస్తున్నారు



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

గ్రామీణాభివృద్ధే దేశాభివృద్ధికి పునాదని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను అభినందించారు. గ్రామస్థాయిలో ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నందుకు వారిని ప్రశంసించారు. రహదారులు, తాగునీరు, నివాస వసతులు, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన మార్పులు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర రాజకీయాలపై స్పందించిన ఆయన, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఈ తీరుపై ప్రజలు ఇప్పటికే స్పష్టమైన అభిప్రాయం ఏర్పరుచుకు న్నారని అన్నారు. గ్రామీణ ప్రజలు బీజేపీ ని అక్కున చేర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పిటీసీ, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కె. విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో రాష్ట్రపతి పర్యటన



ఆయన నేరుగా రామోజీ ఫిల్మ్ సిటీకి వెళ్లనున్నారు. సమావేశం అనంతరం రాజ్‌భవన్‌కు చేరుకుని అక్కడే రాత్రి బస చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇప్పటికే పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గచ్చిబౌలిలోని బ్రహ్మ కుమారిస్ శాంతి సరోవర్‌ను రాష్ట్రపతి సందర్శించారు. బ్రహ్మ కుమారిస్ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క రాష్ట్రపతి ముర్ముకు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఒకేసారి హైదరాబాద్‌లో పర్యటించడం నేపథ్యంలో నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. పలు కీలక జాతీయ కార్యక్రమాలకు హైదరాబాద్ వేదికగా నిలవడం నగర ప్రాధాన్యతను మరింత పెంచిందని అధికారులు పేర్కొన్నారు

# గాంధీ పేరు వింటేనే మోదీకి వణుకు



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

గాంధీ పేరు పలికితే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ఉలికిపడతారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎంజీ రోడ్డులో నిర్వహించిన ధర్నాలో ఆయన తీవ్రస్థాయిలో బీజేపీపై విమర్శలు గుప్పించారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం అనివార్యమని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబం పేరు వినగానే బీజేపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడతాయన్నారు. గాడ్సేను పూజించే వారే గాంధీ పేరు జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గాంధీ పేరు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయమని, దాన్ని ఎవరూ చెరిపివేయలేరని స్పష్టం చేశారు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో చర్చించి సోనియా గాంధీ నేతృత్వంలో జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా గ్రామీణ పేదలకు వంద రోజుల ఉపాధి కల్పించారని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఈ పథకానికి నిధులు క్రమంగా కోత పెడుతూ వస్తోందని, ఇప్పుడు గాంధీ పేరు తొలగించడం ద్వారా పథకానికే తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు తెరలేపిందని, మనుస్మృతి అమలు చేయాలన్న పన్నాగాలు చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన వెడమ బొజ్జు ఎమ్మెల్యేగా గెలవడమే ఈ పథకం ప్రాధాన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టారని వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేక విధానాలతో బీజేపీ గ్రామీణ స్థాయిలో పూర్తిగా తిరస్కరించబడిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్యే వెడమా బొజ్జు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతకే సైన్స్ ఫెయిర్





**- ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్. నాగరాజు**

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

విద్యార్థులలో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్లు దోహదపడతాయని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. పాఠశాల విద్యాశాఖ హనుమకొండ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ శనివారం హనుమకొండ సెయింట్ పీటర్స్ ఎడ్యూ స్కూల్ ఆవరణలో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి డీఈవో గిరి రాజ్ గౌడ్ సభాధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఇరువురు ఎమ్మెల్యేలు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సైన్స్ ద్వారా రుగ్మతలను, మూఢనమ్మకాలను పారద్రోలాలని కోరారు. సాంకేతిక పరికరాలు అనేకం అందుబాటులోకి రావడంతో విద్యార్థులలో ఆలోచన శక్తి తగ్గి వాటి మీదనే ఆధారపడటం ఎక్కువైందన్నారు. ప్రకృతిని నాశనం చేస్తుండడం వల్లే అనేక రకాలైన అనర్థాలు వస్తున్నాయన్నారు. ఇటీవల హనుమకొండ నగరానికి అకస్మాత్తుగా వచ్చిన వరదలే ఉదాహరణగా చెప్పారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఉపాధ్యాయుల చేతిలో, పోలీసుల చేతిలో బెత్తం పోయిన కారణంగా విద్యార్థులలో క్రమశిక్షణ తగ్గుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డీఈవో మాట్లాడుతూ... మూడు రోజులపాటు జిల్లాస్థాయి విద్యా ,వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయికి ఎంపికైన ఇన్స్ స్పైర్ జిల్లా సైన్స్ ఫెయిర్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, సీఎంఓ బద్దం సుదర్శన్ రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి రామ్ ధన్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సదానందం గౌడ్, సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల అధినేత నారాయణరెడ్డి, సెయింట్ పీటర్స్ ఎడ్యూ స్కూల్ ప్రిన్సిపాల్ హరిత, ట్రస్మా అధినేత సతీష్, ఎంఈఓ లు నెహ్రూ నాయక్, మనోజ్ కుమార్, డాక్టర్ వి. జగన్ తదితరులు పాల్గొన్నారు.

# దామరచర్ల ఎంఈవోగా సైదానాయక్

**వేద న్యూస్, దామరచర్ల :**



దామరచర్ల మండల విద్యాధికారిగా కేతావత్ సైదానాయక్ నియమితులయ్యారు. దిలావర్ పూర్ జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్ ఎం గా పనిచేస్తున్న సైదా నాయక్ ఎం ఈ ఓ గా నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ , విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# యూరియా యాప్‌పై రైతులకు అవగాహన



**వేద న్యూస్, కాసిపేట:**

ముత్యంపల్లి రైతు వేదికలో మండల రైతులకు యూరియా బుకింగ్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇక నుంచి యూరియా కొనుగోలు పూర్తిగా ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారానే జరుగుతుందని అధికారులు తెలిపారు. రైతులు తమ మొబైల్ లేదా ఆధార్ నెంబర్ ద్వారా యాప్‌లో ముందుగా యూరియా బుక్ చేసుకొని, అనంతరం డీలర్ వద్దకు వెళ్లి తీసుకోవాలని సూచించారు. పట్టాదారులు, పట్టా లేని రైతులు, కౌలు రైతులు ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవచ్చని వివరించారు. యూరియా విక్రయాలు అన్ని డీలర్లు ఈ యాప్ ద్వారానే నిర్వహించాలన్న ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. ప్లే స్టోర్‌లో యాప్ అందుబాటులో ఉందని, రైతులందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీధర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

# మానవ జీవితంలో క్రీడలు తప్పనిసరి

- విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి
- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం
- యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ మీట్ ముగింపు



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

మానవ జీవితంలో క్రీడలు తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండి విద్యను అభ్యసించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం అన్నారు. కాకతీయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ మీట్ శనివారం యూనివర్సిటీ మైదానంలో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారు భవిష్యత్తులో మంచి స్థానాల్లో నిలిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యూనివర్సిటీకి మంచి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ అథ్లెటిక్ మీట్‌లో యూనివర్సిటీ పరిధిలోని మూడు జిల్లాలకు చెందిన 36 కళాశాలల నుంచి మొత్తం 210 మంది విద్యార్థినులు, 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శనివారం జరిగిన పోటీలలో 5000 మీటర్స్, 400 మీటర్స్, 4ఐ400 మీటర్స్ రిలే, 100 మీటర్స్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, హై జంప్, ట్రిపుల్ జంప్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం హాజరయ్యారు. అతిథులుగా సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సోమన్న, జనరల్ సెక్రటరీ డాక్టర్ కె. సునీల్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా వివిధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ పోటీలకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఎస్. కుమారస్వామి, వ్యవహరించారు. ఈ అథ్లెటిక్ మీట్‌లో పురుషుల ఓవరాల్ చాంపియన్‌షిప్ కాకతీయ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ విజయం సాధించింది. మహిళల ఓవరాల్ చాంపియన్‌షిప్ టీటీడబ్ల్యూడీఆర్స్, కొత్తగూడెం (కేటీడీఎన్) కళాశాల విజయం సాధించింది. వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లు... మహిళల (సీనియర్ మరియు బిగినర్) విభాగం మైతిలి.., పురుషుల విభాగం ఏ. గౌతమ్ (శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్, ఖమ్మం). ఈ అథ్లెటిక్ మీట్‌కు హాజరైన అన్ని క్రీడాకారులకు కాకతీయ యూనివర్సిటీ ద్వారా వసతి, ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించబడ్డాయి.

# ఇచ్చిన మాట నెలబెట్టుకున్న శ్రీరాం రాజేష్

**- బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



కొద్దీ రోజుల క్రితం ఖిలా వరంగల్ చిల్డ్రన్స్ పార్క్ లో గుర్రం దాడిలో ప్రమాదవశాత్తు చనిపోయిన బాధిత కుటుంబానికి శ్రీరాం రాజేష్ ఆర్థిక సహాయం చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో కూడా సహాయం అందేలా చేస్తా అని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శనివారం అటవీ,పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిపించారు. ఈ సందర్భంగా శ్రీరాం రాజేష్ మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని చూసిన మంత్రి కొండా సురేఖ చలించి ఓదార్చి అధైర్య పడవద్దని మీకు అండగా కొండా దంపతులు ఎల్లవేళలా ఉంటారన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సహాయం ఇప్పిస్తానని చెప్పి ఉండటానికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇప్పిస్తానని మాట ఇచ్చారని చెప్పారు.స్థానిక మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సిఐను పిలిచి గుర్రంకు సంబంధించిన యజమాలను పిలిచి వారి చేత కూడా న్యాయం జరిగేలా చెయ్యండని ఆదేశాలు మంత్రి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పగడాల సతీష్,బత్తుల నవీన్ కుమార్,అక్షిత్ పటేల్, ప్రియదర్శిని, శ్రీలత, లత , బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఫిజియోథెరపీ,తరగతి గదుల ప్రారంభం

**- మల్లాకాంబ మనోవికాస కేంద్రంలో**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



మల్లాకాంబ మనోవికాస కేంద్రంలోని బధిర, మానసిక దివ్యాంగుల ఉజ్వల భవిష్యత్తు కోసం అప్టస్ హౌసింగ్ ఫైనాన్స్ ఇండియా లిమిటెడ్ (చెన్నై) వారు తమ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్మించిన నూతన తరగతి గదులు మరియు థెరపీ సెంటర్లను శనివారం ఘనంగా ప్రారంభించారు. అప్టస్ సంస్థ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ యం. ఆనందన్ ఈ గదులను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు అండగా నిలవడం తన జీవితకాల స్వప్నమని, ఆ లక్ష్యం నేడు నెరవేరడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అప్టస్ ఏవీపీ అడ్మిన్ ఇన్-ఛార్జ్ యమ్. శంకర్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఆరు రాష్ట్రాల్లో 350 బ్రాంచీలతో కార్యకలాపాలు సాగిస్తోందని, తెలంగాణలో సామాజిక బాధ్యతలో భాగంగా మొట్ట మొదటిసారి మల్లికాంబ మనోవికాస కేంద్రానికి తోడ్పాటు అందిం చామని తెలిపారు. మానసిక దివ్యాంగుల ఎదుగుదలకు అత్యంత అవసరమైన స్పీచ్ థెరపీ, ఫిజియో థెరపీ గదులతో పాటు బధిరుల కోసం అత్యాధునిక తరగతి గదులను నిర్మించి ఇచ్చామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.మల్లికాంబ సంస్థ నిర్వాహకురాలు బండ రామలీల మాట్లాడుతు 24 ఏళ్లుగా సంస్థ ఎదుర్కొంటున్న వసతుల కొరతను ఈ నూతన గదుల నిర్మాణం తీర్చిందని నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అప్టస్ తెలంగాణ స్టేట్ హెడ్ యమ్. జయశంకర్, సీనియర్ మేనేజర్ రాజసింగ్, దయానిధి పాల్గొన్నారు. మల్లికాంబ సంస్థ ప్రతినిధులు బండ రామలీల, ప్రొఫెసర్ పద్మ, బండ సదానందం, కోడం కల్యాణ్, సంస్థ సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూరియాకు 'యాప్' ఇక్కట్లు

- రైతుల్లో నెలకొన్న ఆందోళన
- సర్కారు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలి
- టీఆర్ఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు

**వేద న్యూస్, వరంగల్:**



రాష్ట్ర ప్రభుత్వం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టి యూరియాకు బుకింగ్ తప్పనిసరి చేసింది. ఈ నిర్ణయం వల్ల జిల్లాలోని చాలా మంది రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అన్నదాతల్లో ఆందోళన నెలకొందని టీఆర్ఆర్ఎస్(తెలంగాణ రైతు రక్షణ సమితి) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు వరికెల పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ..చాలా మంది రైతులకు స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ సదుపాయం లేకపోవడం వల్ల యాప్‌లో బుకింగ్ చేయించడం సాధ్యం కావడం లేదన్నారు. ప్రతి రైతుకు విడిగా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉండడం వల్ల సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయని, యాప్‌లో బుకింగ్ చేయించినా కొందరు డీలర్లు సరిగా ఎరువులు ఇవ్వకపోవడం వల్ల కర్షకులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర సర్కారు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ తప్పనిసరి నిబంధనను సడలించి, రైతులు ఆఫ్‌లైన్‌లో కూడా యూరియా బుకింగ్ చేయించే వీలు కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో ఒక స్థానిక సహాయకుడు (ఉదా: సర్పంచ్, వ్యవసాయ సహాయకుడు, గ్రామ సచివాలయ సిబ్బంది) ద్వారా యాప్‌లో బుకింగ్ చేయించే వీలు కల్పించాలని, యాప్‌లో బుక్ చేసుకున్న రైతులకు డీలర్లు సకాలంలో ఎరువులు ఇచ్చేలా పటిష్టమైన చర్యలుండాని చెప్పారు. యాప్‌ని సరళంగా, తెలుగులో ఉండేలా చేసి, రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. రైతులకు 'యాప్' చిక్కులు ఇలానే కొనసాగితే పంటలకు సకాలంలో యూరియా పొందలేకపోతారని, దీని వల్ల పంటలకు హాని చేకూరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సులభంగా, సురక్షితంగా యూరియా లభించేలా చర్యలు తీసుకోవాలని రైతు రక్షణ సమితి తరఫున కోరతున్నట్లు తెలిపారు

# సైన్స్ ఫెయిర్‌లో తాటికాయల జెడ్పిహెచ్ఎస్ విద్యార్థిని ప్రతిభ

**వేద న్యూస్, ధర్మసాగర్:**




హనుమకొండ జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో తాటికాయల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఆమంచ గీతిక శ్రీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.గ్రామానికి చెందిన ఆమంచ రమేష్ కుమార్తె అయిన గీతిక శ్రీ "మున్సిపల్ నీటి లీకేజీని స్వయంచాలకంగా గుర్తించే విధానం" అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్ట్ జిల్లా స్థాయి న్యాయనిర్ణేతల ప్రశంసలు పొందింది. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో డిసెంబర్ 18 నుండి 20 వరకు నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించగా, వినూత్న ఆలోచన, సామాజిక ప్రయోజనం, సాంకేతిక స్పష్టత అంశాల్లో అత్యుత్తమంగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ ప్రాజెక్ట్‌కు పి. దీప్తి (భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని), జి. ఉషారాణి (జీవ శాస్త్ర ఉపాధ్యాయిని) మార్గదర్శకులుగా వ్యవహరించారు. విద్యార్థిని ప్రతిభకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు డి. నవీన్ కుమార్, టి. వసుందర, పి. శ్రీనివాస్, బి. రాజు, ఎస్. ఇందిరాణి, ఎన్. కల్యాణ్, పిఎస్ హెచ్‌ఎం బి. వెంకటేశ్వరరెడ్డి, రాజు, హేమలత అభినందనలు తెలిపారు.రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ గీతిక శ్రీ మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి పాఠశాల పేరు ప్రతిష్ఠలు నిలబెట్టాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

వేద న్యూస్



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..




– ఎస్సై నరేష్ రెడ్డి

**వేద న్యూస్, చొప్పదండి:**

సైబర్ నేరాల పట్ల యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేష్ రెడ్డి అన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ ఆరువారాల కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని కృష్ణ వేణి టాలెంటెడ్ స్కూల్ లో 'పైసా పైలం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు, యువత, ప్రజలకు సైబర్ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి, సైబర్ నేరాలను నివారించడమే తమ లక్ష్యం అన్నారు. బిజినెస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, ఐడెంటిటీ థెఫ్ట్, లోన్ మోసాలు, ప్రకటనల మోసాలు ఆన్‌లైన్ భద్రతల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతకాలంలో వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాను పిల్లలు ఎక్కువగా వాడుతున్నారని, వాటిని వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, లోన్ ఇప్పిస్తామని ఫోన్ చేసి సంప్రదిస్తే వాటిని నమ్మవద్దని సూచించారు. అపరిచితులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం ఆధార్, పాన్‌కార్డు ఇతర వివరాలు తెలుపవద్దని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకున్న ప్రతి ఒక్కరూ మిగతా వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులు సైతం సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. ఆన్లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అందరికీ అవగాహన తప్పనిసరి అన్నారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930కి కాల్ చేసి పిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తుంది

– బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు

**వేద న్యూస్, చొప్పదండి**



చొప్పదండి మండల కేంద్రంలోని సమీకృత వసతి గృహాన్ని శనివారం రోజు జాతీయ బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూప శ్యామ్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి బాగోగులను తెలుసుకొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల వసతి గృహాల మెస్ చార్జీలను పెంచి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే అన్ని వసతులను విద్యార్థులు ఉపయోగించుకొని ఉన్నత విద్యలు చదివి ప్రయోజకులు కావాలని కోరారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, కొత్తపల్లి రవి కిరణ్ జన్మదినం సందర్భంగా శనివారం రుద్రూర్ గ్రామంలోని బాధిత కుటుంబాలు అయిన గుండ్ల బాలయ్య కుటుంబానికి రూ. 2వేలు, నీరడి సాయి కుమార్ కుటుంబానికి రూ. 3వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. అదేవిధంగా గ్రామంలోని నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ గాండ్ల మధు, సీనియర్ నాయకులు డౌర్ సాయిలు, పోచయ్య, శేఖర్, వెంకటేష్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏ ప్రభుత్వం వచ్చినా న్యాయం జరగట్లే




- మానసిక లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రుల బాధలు నాకు తెలుసు
- వారికి ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యం కల్పించాలి
- ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్షకు సిద్ధం
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఎన్ఐఈపీఐడీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు, తల్లిదండ్రులతో భేటీ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

మానసిక పరిపక్వత తక్కువగా ఉన్న పిల్లలకు ఏ ప్రభుత్వం వచ్చినా సరైన న్యాయం జరగలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బోయిన్‌పల్లి మనో వికాస్ నగర్‌లోని మానసిక అభివృద్ధి లోపం ఉన్న వ్యక్తుల సాధికార సంస్థలో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు, వారి తల్లిదండ్రులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమావేశమయ్యారు. ఇటీవల జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా ఈ సంస్థను సందర్శించిన కవిత, అనంతరం జాగృతి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. మన దేశంలో మానసిక ఎదుగుదల లోపం ఉన్నవారిని గతంలో దివ్యాంగులుగా గుర్తించలేదని గుర్తు చేశారు. అయితే పార్లమెంట్‌లో పోరాటం చేసిన ఫలితంగా 21 రకాల సమస్యలు ఉన్నవారిని దివ్యాంగులుగా గుర్తించారని తెలిపారు. తెలంగాణలో దివ్యాంగుల తల్లి దండ్రులకు ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత కల్పించేలా తానే పోరాటం చేసి ఉత్తర్వులు తీసుకొచ్చినప్పటికీ, అవి సక్రమంగా అమలు కావడం లేదని విమర్శించారు. మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రుల బాధలు తనకు బాగా తెలుసునని కవిత అన్నారు. ఇలాంటి కుటుంబాలకు ఇళ్లు అద్దెకు కూడా దొరకని పరిస్థితి ఉందని చెప్పారు. అందుకే వారికి రెండు గదుల ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నానని స్పష్టం చేశారు. అలాగే పెన్షన్ కూడా తప్పనిసరిగా ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా ఈ సమస్యతో బాధపడుతున్నవారు ఉన్నారని అంచనా ఉందన్నారు. వారందరికీ పెన్షన్ ఇచ్చే సామర్థ్యం ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం పెన్షన్లు ఇవ్వకపోతే అది మనసు లేనట్టేనని వ్యాఖ్యానించిన కవిత, ప్రతి ప్రభుత్వ పథకంలో మానసికంగా, శారీరకంగా సవాళ్లు ఎదుర్కొంటున్న పిల్లల తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భర్తను కోల్పోయిన మహిళలు, ఒంటరి మహిళలకు కూడా పెన్షన్ల విషయంలో ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. పిల్లలను అవమానించకుండా, గౌరవించే విధంగా ప్రభుత్వం విధానాలు రూపొందించాలన్నారు. ప్రజాప్రతినిధుల బాధ్యతగా మీ తరపున తానే పోరాటం చేస్తానని, మీకు ఇబ్బంది లేకుండా చూస్తానని కల్వకుంట్ల కవిత భరోసా ఇచ్చారు.

# హమాలీ కార్మికులకు బ్లాంకెట్స్ పంపిణీ



**వేద న్యూస్, చొప్పదండి**

లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి ఆధ్వర్యంలో శనివారం రోజు లయన్ తొడుపునూరి లక్ష్మయ్య పుట్టినరోజు సందర్భంగా 40 మంది హమాలీ కార్మికులకు బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్మన్ కొల్లూరి జితేందర్ మాట్లాడుతూ.. చలికాలంలో చలికి ఇబ్బంది పడుతున్న హమాలీ కార్మికులకు బ్లాంకెట్స్ ఇవ్వడం చాలా అభినందనీయం అని పేర్కొన్నారు. పుట్టినరోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని క్లబ్ కార్యవర్గం, సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్, జోన్ చైర్మన్, క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, క్యాబినెట్ సభ్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మెగా లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి



**వేద న్యూస్, మెదక్:**

మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమను, ఎస్పీ డీవీ శ్రీనివాస రావు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ఏర్పాట్లు, లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వచ్చే కేసుల వివరాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. న్యాయస్థానంపోలీస్ శాఖల మధ్య సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

–ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి



**వేద న్యూస్, హైదరాబాద్ :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టుతున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు పిడమర్తి రవి తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, జనవరి మొదటి ఆదివారం నుంచి ప్రతి నెల మొదటి ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు దండ వేయడం ద్వారా ఆయన సిద్ధాంతాలు, ఆలోచనలు ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ వాదులు ఎక్కడ ఉన్నా, వారి వారి ప్రాంతాల్లో స్వచ్ఛందంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సమానత్వం, న్యాయం, సామాజిక సమతా భావాలను పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పిడమర్తి రవి పేర్కొన్నారు. అంబేద్కర్ సిద్ధాంతాలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రజల నిత్య జీవితంలో అమలయ్యేలా చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువత, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు అంబేద్కర్ ఆలోచనలపై అవగాహన పెంచుకుని, సామాజిక మార్పుకు భాగస్వాములవ్వాలని ఆయన కోరారు. అంబేద్కర్ చూపిన రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో నాటాలని ఆయన అభిప్రాయపడ్డారు. జనవరి మొదటి వారంలో హైదరాబాద్ ట్యాంక్ బండ్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించనున్నట్లు పిడమర్తి రవి తెలిపారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ వాదులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మీనాక్షి నటరాజును కలిసిన మహేష్



**వేద న్యూస్, కాశీబుగ్గ :**

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజ్ ను శనివారం హైదరాబాద్ గాంధీ భవన్ లో వర్ధన్నపేట నియోజకవర్గం 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ గ్రామానికి చెందిన సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ అడుప మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. గత 26సంవత్సరాలుగా తాను కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్నానని మహేష్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లినట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో తనపై అక్రమ కేసులు బనాయించి, బైండోవర్లు చేశారని తెలిపారు పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి రాష్ట్రస్థాయిలో తనకు నామినేటెడ్ పదవి ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కాగా తన వినతిపై ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సానుకూలంగా స్పందించారని, పార్టీ ముఖ్యలతో మాట్లాడి రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్ట్ ఇప్పిస్తానని హామీ ఇచ్చినట్లు మహేష్ తెలిపారు

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- పది రోజుల్లో అక్రిడిటేషన్ కార్డుల జీవో
- వచ్చే ఏడాది ఇళ్ల స్థలాల కేటాయింపు పై తీపి కబురు
- టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటన

**వేద న్యూస్, ఖమ్మం :**

జర్నలిస్టుల చిరకాల వాంఛలైన అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో మంత్రి ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు.

**త్వరలో అక్రిడిటేషన్ కార్డులు**

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

**ఇళ్ల స్థలాలపై స్పష్టత**

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇప్పటికే లోతుగా చర్చించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల వల్ల కొంత ఆలస్యమైందని అయితే వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం తరపున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు.

**సమిష్టిగా ముందుకు సాగాలి**

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం నాయకులను, సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం డిసెంబర్ 21, 2025

# 'ఆజంజాహి మిల్స్'పై వినతిపత్రం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



ఆజం జాహి మిల్లులను కాపాడటానికి వరంగల్ ప్రాంతానికి చెందిన మిల్లు కార్మికులు యూత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొరవి పరమేశ్వర్ ఆధ్వర్యంలో హైదరాబాద్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ను మర్యాదపూర్వకం గా కలిశారు. అనంతరం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు వారి సమస్యలు తెలియజేస్తూ 318 మంది కార్మికుల స్థలం విషయం గురించి వారికి విన్నవించారు. మీనాక్షి నటరాజన్ కార్మికుల విషయంపై సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారని కార్మికులు తెలిపారు. అదేవిధంగా వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కూడా కలవమని నటరాజన్ కార్మికులకు సలహా ఇవ్వడంతో మంత్రి పొంగులేటిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, కొమ్ముల సందీప్ కుమార్, సింగిరెడ్డి యశోద, గుత్తికొండ రవి, గద్దల శ్యామ్, సిరిమల్లె మార్కండేయ, ఆరెల్లి బిక్షపతి, కొమ్ముల కృష్ణ తదితరులు ఉన్నారు.

# సమతుల్య జీవనానికి ఈ రెండూ అవసరం

**వేద న్యూస్, జమ్మికుంట:**



డిసెంబర్ 21వ తేదీని ప్రతి ఏడాది ప్రపంచ ధ్యాన దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ధ్యానం (మెడిటేషన్) అంటే సరళంగా చెప్పాలంటే.. మనసును ఏకాగ్రతతో ఒకే చోట నిలపడం. సంస్కృతంలో 'ధ్యై' అనే ధాతువు నుండి ధ్యానం అనే పదం వచ్చింది, దీని అర్థం "ఆలోచించడం" లేదా "ధ్యాస పెట్టడం".

చాలామంది ధ్యానం అంటే ఆలోచనలను బలవంతంగా ఆపేయడం అనుకుంటారు, కానీ అది నిజం కాదు. ధ్యానం అంటే మనసులోకి వచ్చే ఆలోచనలను గమనిస్తూ, వాటితో సంబంధం లేకుండా ప్రశాంతంగా ఉండటం. ధ్యానం అసలు ఉద్దేశ్యం

అంతర్ముఖం అవ్వడం.. అంటే బయట ప్రపంచంలో జరిగే గందరగోళం నుండి తప్పుకుని, మన లోపలికి మనం ప్రయాణించడం. మనసులోకి వచ్చే కోపం, ఆనందం, బాధ వంటి భావాలను ఒక సాక్షిలా గమనించడం. గతం గురించి బాధపడకుండా, భవిష్యత్తు గురించి భయపడకుండా "ఈ క్షణం" లో వర్తమానంలో ఉండటం.

**ధ్యానం ఎలా చేయాలి?**

మీరు ధ్యానం మొదలుపెట్టాలనుకుంటే ఈ చిన్న పద్ధతి పాటించండి. స్థిరమైన ఆసనం అంటే.. ప్రశాంతమైన చోట వెన్నెముక నిటారుగా ఉంచి కూర్చోండి. శ్వాసపై ధ్యాస కళ్లు మూసుకుని మీ శ్వాస లోపలికి ఎలా వెళ్తోంది, బయటకు ఎలా వస్తోంది అనేది గమనించండి.. ఆలోచనలు వస్తే: ధ్యానం చేసేటప్పుడు ఆలోచనలు రావడం సహజం. అవి వచ్చినప్పుడు కంగారు పడకుండా, మళ్లీ నెమ్మదిగా మీ ధ్యాసను శ్వాస మీదకు మళ్లించండి. ధ్యానం వల్ల కలిగే ముఖ్య లాభాలు మనశ్శాంతి, ఆరోగ్యం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం.

**వైద్యమా.. ఆధ్యాత్మికతా.. ఏది ముఖ్యం?**

ఈ రోజుల్లో చాలామంది ఒక ప్రశ్నతో అయోమయంలో పడుతున్నారు. అదేంటంటే.."వైద్యమే ముఖ్యమా? ఆధ్యాత్మికతే ముఖ్యమా?" ఈ ప్రశ్నకు సమాధానం ప్రముఖ వైద్యుడు, గోల్డ్ మెడలిస్ట్, కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఊడుగుల సురేశ్ చెప్పారు. వైద్యంతో పాటు ఆధ్యాత్మికత..రెండూ ముఖ్యమేనని, రెండూ కలిసినప్పుడే జీవితం సంపూర్ణమవుతుందని చెప్పారు. మన శరీరం ఒక యంత్రంలాంటిదని, దానికి సమస్య వచ్చినప్పుడు డాక్టర్ అవసరమని స్పష్టం చేశారు. వైద్య శాస్త్రం..వ్యాధిని గుర్తిస్తుందని, మందులు, చికిత్సలతో ఉపశమనం కలిగించి..ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. అయితే, ఈ క్రమంలో జ్వరమొచ్చినా, షుగర్ వచ్చినా, బీపీ పెరిగినా "ధ్యానం చేస్తే సరిపోతుంది" అని మందులు వదలడం సరైనది కాదని, అలా చేయడం అవివేకమని తెలిపారు. ఆధ్యాత్మికత శరీరానికి కాదు, మనస్సుకు ఔషధం వంటిదని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక సాధనల వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, భయం, కోపం, ఆందోళన తగ్గుతాయని, కష్టాలను స్వీకరించే శక్తి పెరుగుతుందని వెల్లడించారు.

# ప్రపంచ ధ్యాన దినోత్సవం

## - మనసు ప్రశాంతతే నిజమైన బలం

**వేద న్యూస్ డెస్క్:**

ఆధునిక సమాజంలో మనిషి జీవితం అపారమైన వేగంతో ముందుకు సాగుతోంది. పని ఒత్తిళ్లు, లక్ష్యాల కోసం పరుగు, ఆర్థిక భద్రతపై ఆందోళన, సామాజిక పోలికలు ఇవన్నీ కలిసి మనసును నిత్యం అలజడిలోకి నెట్టేస్తున్నాయి. భౌతిక సౌకర్యాలు పెరిగినా, అంతర్గత శాంతి మాత్రం తగ్గిపోతోంది. రోజంతా శరీరం పని చేసినా, మనసుకు విశ్రాంతి దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం మనకు ఒక కీలక సందేశాన్ని ఇస్తోంది. జీవితం అంటే కేవలం సాధనల జాబితా మాత్రమే కాదని, మనసు ఆరోగ్యంగా ఉన్నప్పుడే నిజమైన ఆనందం సాధ్యమవుతుందన్న సత్యాన్ని ఈ రోజు గుర్తు చేస్తోంది. నిత్యజీవితంలో కొద్దిసేపు అయినా మనల్ని మనమే వినే అవకాశం ఇవ్వకపోతే, లోపల పెరుగుతున్న అలజడి చివరికి పెద్ద సమస్యలుగా మారుతుందన్న హెచ్చరికను ధ్యానం అందిస్తోంది.

ధ్యానం అనేది కొంతమంది మాత్రమే చేసే ఆధ్యాత్మిక సాధన అన్న భావన ఇప్పటికీ చాలామందిలో ఉంది. కానీ వాస్తవానికి ఇది ప్రతి ఒక్కరికీ అవసరమైన జీవన నైపుణ్యం. మన ఆలోచనలను గమనించడం, భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, స్పందనకు ముందు ఒక క్షణం ఆలోచించే అలవాటు పెంపొందించుకోవడం ఇవన్నీ ధ్యానం ద్వారా సాధ్యమవుతాయి. కోపం, అసహనం, భయం వంటి భావాలు మన జీవితంలో సహజమే. వాటిని పూర్తిగా తొలగించడం కంటే, అదుపులో ఉంచుకోవడమే అసలు లక్ష్యం. ధ్యానం ఆత్మ నియంత్రణను పెంచి, క్లిష్ట పరిస్థితుల్లోనూ స్థిరంగా ఉండే శక్తిని ఇస్తుంది. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు నిర్ణయాలు స్పష్టంగా ఉంటాయి, సమస్యలు భారంగా అనిపించవు, జీవితంపై దృష్టి మరింత కేంద్రీకృతమవుతుంది.

ఈ రోజుల్లో మానసిక ఆరోగ్యం ఒక పెద్ద సవాలుగా మారింది. ఆందోళన, నిరాశ, నిద్రలేమి, ఒత్తిడి వంటి సమస్యలు వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తున్నాయి. మందులు కొంత ఉపశమనం ఇవ్వగలిగినా, జీవనశైలిలో మార్పు లేకపోతే సమస్యలు మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉంటాయి. ఇక్కడే ధ్యానం ప్రాముఖ్యత స్పష్టమవుతుంది. ఇది ఖర్చు లేని, సహజమైన మార్గం. రోజూ కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చుని శ్వాసపై దృష్టి పెట్టడం, వర్తమాన క్షణంలో ఉండే ప్రయత్నం చేయడం ద్వారా మనసు క్రమంగా స్థిరపడుతుంది. దీర్ఘకాలంలో ఇది మానసిక ఆరోగ్యాన్ని బలపరచడమే కాకుండా, శారీరక ఆరోగ్యంపైనా సానుకూల ప్రభావం చూపుతుందన్నది అనేక అధ్యయనాలు సూచిస్తున్న వాస్తవం.

వ్యక్తిగత స్థాయిలో మొదలైన ధ్యానం ప్రభావం సమాజం వరకూ విస్తరిస్తుంది. ప్రశాంతమైన మనసులు ఉన్న సమాజంలో అసహనం తగ్గుతుంది, సహనం పెరుగుతుంది, పరస్పర గౌరవం బలపడుతుంది. కుటుంబాల్లో చిన్నచిన్న సమస్యలు పెద్ద గొడవలుగా మారకుండా ఆగిపోతాయి. కార్యాలయాల్లో పని వాతావరణం ఆరోగ్యకరంగా మారి, ఉత్పాదకత పెరుగుతుంది. ప్రపంచ ధ్యాన దినోత్సవం ఒకరోజు పాటించే కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ప్రతిరోజూ ఆచరించాల్సిన అలవాటుగా మారాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. నిజమైన అభివృద్ధి ఎత్తైన భవనాల్లో, పెద్ద సంఖ్యల్లో కాదుబీ ప్రశాంతమైన మనసుల్లోనే మొదలవుతుందన్న సత్యాన్ని ఈ రోజు మనకు బలంగా గుర్తుచేస్తోంది.

# ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చట్టరీత్య నేరం

- వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి
  సీఐ కే.సుజాత

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**





ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చట్టరీత్యా నేరమని సీఐ కే. సుజాత అన్నారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులను మాటలు, చేతల ద్వారా వేదనకు గురిచేయడం, కష్టపెట్టడం తప్పు అన్నారు. విద్యార్థులను శారీరకంగా మానసికంగా అవ మానించడం ర్యాగింగ్ అన్నారు. షీ టీమ్ సీఐ కే. సుజాత ఆధ్వర్యంలో హన్మకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ మరియు మహిళా పిజి విద్యార్థి, విద్యార్థినులకు ర్యాగింగ్ ఈవ్‌టీజింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రయాణాల్లో భద్రత కోసం 'టీ-సేఫ్' యాప్ను వినియోగించాలని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మహిళలపై అనుచితంగా ప్రవర్తిస్తే ధైర్యంగా వెంటనే షీ టీమ్ వరంగల్ పోలీస్కు సమాచారం ఇవ్వాలని, సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తిని నిర్మలా గీతాంబ, కేయూ రిజిస్టర్ రామచంద్రన్, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ రాంరెడ్డి , మహిళా కానిస్టేబుల్ లక్ష్మి, లావణ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# 15 ఏళ్ల రోడ్డు సమస్యకు హైడ్రా పరిష్కారం

- 50 అడుగుల రహదారిలో తొలగిన ఆక్రమణలు
- ఆర్విండ్ ఎన్‌క్లేవ్‌లో రహదారి పునఃప్రారంభం
- కాలనీ వాసులకు ఊరట కలిగించిన చర్యలు
- అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు సులభ రాకపోకలు

**హైదరాబాద్ వేద న్యూస్ :**



మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం ఆర్విండ్ ఎన్‌క్లేవ్‌లో దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతున్న రహదారి సమస్యకు హైడ్రా శాశ్వత పరిష్కారం చూపింది. 50 అడుగుల వెడల్పున్న రహదారిపై గదులు నిర్మించి ఆక్రమణలకు పాల్పడిన వారిపై హైడ్రా శనివారం కఠిన చర్యలు చేపట్టింది. రహదారిపై అడ్డంగా గోడలు కట్టి చేపట్టిన పలు అక్రమ నిర్మాణాలను తొలగించి, మూసుకుపోయిన రహదారిని తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆర్విండ్ ఎన్‌క్లేవ్‌లోని రోడ్ నంబర్ నాలుగును ఆక్రమించి అదే మార్గంలో ఇళ్ల యజమానులు నిర్మాణాలు చేపట్టడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై గతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని స్థానికులు తెలిపారు. రహదారిలో ఆటంకాల కారణంగా ప్రధాన రహదారికి చేరేందుకు కేవలం వంద మీటర్ల దూరం ఉన్నప్పటికీ, కిలోమీటరుకు పైగా తిరిగి వెళ్లాల్సి వస్తోందని వారు వాపోయారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, దీనిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు సమస్య తీవ్రతను గుర్తించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు శనివారం ఆక్రమణల తొలగింపు చేపట్టారు. అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించడంతో మూసుకుపోయిన రహదారి మళ్లీ తెరుచుకుంది. రహదారి పునఃప్రారంభంతో హర్ష హాస్పిటల్ లేన్‌కు సులభంగా చేరుకుంటున్నామని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎదురైన ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోయాయని చెప్పారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాల రాకపోకలకు ఆటంకాలు తొలగి నట్టు తెలిపారు. హైడ్రా అధికారుల సత్వర స్పందన, కఠిన చర్యలపై కాలనీ వాసులు అభినందనలు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిం చి పరిష్కారం చూపిన విధానం ప్రశంసనీయమని పేర్కొన్నారు. నగరంలో రహదారులపై ఆక్రమణలను తొలగించి ప్రజలకు న్యాయం చేయడంలో హైడ్రా చర్యలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## అలిపిరి చెక్‌పోస్ట్ భద్రతకు

# ఇండియన్ బ్యాంక్ విరాళం

**తిరుమల, వేద న్యూస్ :**




అలిపిరి చెక్‌పోస్ట్ వద్ద భక్తుల భద్రతను మరింత బలోపేతం చేయడానికి ఏర్పాటు చేయనున్న సెక్యూరిటీ లగేజీ స్కానర్ కోసం ఇండియన్ బ్యాంక్ టీటీడీకి రూ.37,97,508 విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ మేనేజర్ ప్రణేశ్ కుమార్, అదనపు ఈవో లిసి.హెచ్. వెంకయ్య చౌదరిలికి విరాళం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం. సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఇందిరా, తిరుమల బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర పాల్గొన్నారు. భక్తుల రాకపోకలు అధికంగా ఉండే అలిపిరి చెక్‌పోస్ట్ వద్ద అత్యాధునిక లగేజీ స్కానర్ ఏర్పాటు చేయడం ద్వారా భద్రత మరింత పటిష్టమవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. భక్తుల సౌకర్యం, భద్రతే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు సమర్పించిన కానుకలతో శ్రీవారి హుండీకి ఒక రోజులో రూ.4.31 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న ఒక్కరోజే 64,729 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 22,162 మంది భక్తులు తలనీలాలు సమర్పించినట్లు తెలిపారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లతో పాటు దర్శన సౌకర్యాలను మెరుగుపరచడానికి టీటీడీ పలు చర్యలు తీసుకుంటోందని అధికారులు పేర్కొన్నారు. అలిపిరి చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేయనున్న లగేజీ స్కానర్ భక్తుల భద్రతకు మరింత భరోసా కల్పించనుందని తెలిపారు.

# మూసాపేట ఘటనలో నిందితుడు అరెస్ట్ - ఎస్పీ డి. జానకి



**హైదరాబాద్ వేద న్యూస్ :** మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామంలో జరిగిన యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ డి. జానకి వెల్లడించారు. శనివారం మూసాపేట పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలను ఆమె వెల్లడించారు. ఈ కేసులో నిందితుడిగా సంగు విష్ణు అలియాస్ ఇంటెంకి విష్ణు అలియస్ వాకిటి విష్ణుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 17న రాత్రి ఎస్సీ కులానికి చెందిన యువతిపై అత్యాచారం చేయడంతో ఆమె అపస్మారకంలోకి వెళ్లిందన్నారు. బాధితురాలని నిందితుడు, ఆమె బంధువు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యలో చనిపోయిందని వివరించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం నిందితుడిని అరెస్టు చేశామని వెల్లడించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073